MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 18-07-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

## దేవరకొండలోఆగని అక్రమ మద్యం

# విక్రయాల కలకలం..!

రేణుక ఎల్లమ్మ వైన్స్ పరిసరాల్లోనే.. కొనసాగుతున్న దందాపై ఆరోపణలు!?

వాస్తవాలు తేల్చేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక విచారణ చేపట్టాలని ప్రజల డిమాండ్




2లో

**నల్లగొండ నిఘా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):**

దేవరకొండ పట్టణంలో అక్రమ మద్యం విక్రయాల అంశం, మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, పట్టణంలోని రేణుక ఎల్లమ్మ వైన్స్ పరిసర ప్రాంతాల్లోనే, ఆ వైన్స్ ను ఆనుకొని ఉన్న దుకాణంలోనే, అక్రమ మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయంటూ స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.! వైన్స్ షాపు పక్కనే ఉన్న కూల్‌డ్రింక్స్ దుకాణాలు, వాటర్ పాయింట్లు, చిన్న చిన్న స్టాళ్లను అడ్డాలుగా ఉపయోగించుకుని, మద్యం విక్రయాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. మద్యం విక్రయాలకు నిర్దేశించిన సమయం ముగిసిన తర్వాత కూడా, కొందరు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని స్థానికులు అంటున్నారు.! ఈ వ్యవహారం చాలాకాలంగా కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత శాఖలు సమర్థవంతంగా స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# వానమ్మా... ఒక్కసారి అన్న రావా..!!

- ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో విలవిలలాడుతున్న రైతాంగం
- మేడిగడ్డ బ్యారేజ్ ఉన్నా అందని సాగునీరు
- ఆకాశం వైపే ఆశగా చూస్తున్న అన్నదాత
- ఎండిపోతున్న పత్తి పంటలు...పెరుగుతున్న ఆందోళన

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ప్రారంభమైనప్పటికీ, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. వర్షాల కోసం రైతులు ప్రతిరోజూ ఆకాశం వైపు ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పొలాలను దున్ని, విత్తనాలు వేసి, ఎరువులు చల్లి పంటలను సాగు చేసిన రైతులు ఇప్పుడు ప్రకృతి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

5లో





8లో

## కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

# బిజినపల్లి మండలంలో నకిలీ డీఏపీ కలకలం



**మహదేవునిపేటలో 111 బస్తాల నకిలీ డీఏపీ స్వాధీనం**

**నమూనాలను హైదరాబాద్ ప్రయోగశాలకు పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు**

**సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచన**

**ఘటనాస్థలాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** నాగర్‌కర్నూలు జిల్లా బిజినపల్లి మండలంలోని మహదేవునిపేట గ్రామంలో నకిలీ డీఏపీ ఎరువులను రైతులు వినియోగించడం వ్యవసాయ అధికారులు గుర్తించి, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ సందర్భంగా రైతుల నుండి స్వాధీనం చేసుకున్న నకిలీ డిఏపీని పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్, రైతులకు తక్కువ ధరకు నకిలీ డీఏపీ ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించి మోసానికి పాల్పడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా గ్రామంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గ్రామానికి చెందిన ఏడుగురు రైతుల ఇళ్లలో నిల్వ ఉంచిన మొత్తం 111 బస్తాల అనుమానాస్పద డీఏపీ ఎరువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇప్పటికే పంట పొలాల్లో వినియోగించిన 39 డీఏపీ ఖాళీ సంచులను కూడా అధికారులు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తులో భాగంగా భద్రపరిచారు. స్వాధీనం చేసుకున్న ఎరువులను నరేందర్ రెడ్డి గ్రామంలో ఫెర్టిలైజర్ దుకాణదారుని ఇంటి వద్ద నిలిపి విచారిస్తూ , వాహనంలో భద్రపరచగా, విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. స్వాధీనం చేసుకున్న డీఏపీ బస్తాలను పరిశీలించి సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. నకిలీ ఎరువులు రైతుల చేతికి ఎలా చేరాయి, ఏ మార్గంలో సరఫరా జరిగిందనే అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మధు, కళ్యాణిలను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహదేవునిపేట గ్రామానికి చెందిన పొలిముని రాజు, నందిపేట బాలయ్య, దుగ్గని రాములు, బత్తుల రాములు, ఏ. ప్రవీణ్ కుమార్ రెడ్డి, జక్కా మన్యపు రెడ్డి, ఏ. జైపాల్ రెడ్డి అనే రైతులు కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు 1600, 1700 వందల రూపాయలకు ఒక బస్తా చొప్పున విక్రయించడంతో వారి వద్ద నుంచి ఈ డీఏపీ ఎరువులను కొనుగోలు చేసినట్లు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, స్వాధీనం చేసుకున్న డీఏపీ బస్తాల నుంచి నమూనాలను సేకరించి వెంటనే హైదరాబాద్‌లోని గుర్తింపు పొందిన ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా నివేదికలు అందిన వెంటనే చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. నకిలీ ఎరువులుగా నిర్ధారణ అయితే బాధ్యులపై ఎరువుల నియంత్రణ చట్టం, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సాధీనం చేసుకున్న నకిలీ డిఏపి ఎరువులను బిజినపల్లి రైతు వేదికలో భద్రపరచాలని కలెక్టర్ వ్యవసాయ అధికారుల



ఆదేశించారు. అదేవిధంగా ఈ వ్యవహారంపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని జిల్లా పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నకిలీ ఎరువుల సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు, ఏ ప్రాంతం నుంచి వాటిని తీసుకొచ్చారు, జిల్లాలో మరెక్కడైనా ఇలాంటి ఎరువులు విక్రయించారా అనే అంశాలను పూర్తిగా విచారించి సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత డీఎస్పీకి సూచించారు. అవసరమైతే ఇతర జిల్లాలు, కర్ణాటక రాష్ట్ర అధికారులతో కూడా సమన్వయం చేసుకుని దర్యాప్తు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ మాట్లాడుతూ....., రైతులను మోసం చేసే నకిలీ ఎరువుల వ్యాపారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. రైతుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ ధర కంటే చాలా తక్కువకు విక్రయిస్తున్నారని నమ్మి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఎవరైనా ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ రైతులను కోరారు. నకిలీ ఎరువుల వినియోగం వల్ల పంటల దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో పాటు రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వస్తుందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో నకిలీ ఎరువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై నిరంతరం తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాసులు, నాగర్ కర్నూల్ సీఐ , సిఐ అశోక్ రెడ్డి, బిజినపల్లి డిటి రవికుమార్, ఎస్ఐ షంషద్దీన్,ఇతర పోలీసు అధికారులు వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

### దేవరకొండలోఆగని అక్రమ మద్యం

## విక్రయాల కలకలం..!

స్థానికుల్లో కొందరు వ్యక్తం చేస్తున్న అనుమానాల ప్రకారం, వైన్స్ షాపును ఆనుకొని ఉన్న షాపుల్లోనే ఇంత బహిరంగంగా అక్రమ విక్రయాలు జరుగుతున్నాయంటే, దీనిపై వైన్స్ యాజమాన్యానికి సమాచారం లేకపోవడం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.? ఈ ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ ద్వారా తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

**సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించాలని విజ్ఞప్తి**

రేణుక ఎల్లమ్మ వైన్స్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తే, వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అక్రమ విక్రయాలకు సహకరిస్తున్న వారు ఎవరైనా ఉంటే, వారి పాత్రను కూడా వెలికితీసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు యువతను మరింతగా, మద్యం వైపు ఆకర్షించే ప్రమాదం ఉందని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యం, శాంతిభద్రతల దృష్ట్యా ఇలాంటి కార్యకలాపాలను, ఏమాత్రం ఉపేక్షించరాదని సూచిస్తున్నారు. దేవరకొండ పట్టణంలోని అన్ని వైన్స్ షాపుల పరిసరాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమ మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వస్తున్న ఆరోపణలపై వెంటనే స్పందించి, వాస్తవాలు నిర్ధారించి, నిబంధనలు ఉల్లంఘించిన వారెవరైనా ఉంటే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని దేవరకొండ ప్రజానీకం కోరుతున్నారు.

## గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ సస్పెండ్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ విధులకు గైర్హాజరైన విషయం తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌ను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రమేష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు కల్వకుర్తి మండల విద్యాధికారి ఎంఈవో శంకర్ నాయక్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ వివరణ కోరినట్లు డీఈవో వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం, విధులకు క్రమం తప్పకుండా హాజరుకావడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసినట్లు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, పాఠశాలల్లో తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగనున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రమేష్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.



# చేనేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రూ.25 లక్షల షెడ్డు మంజూరుకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హామీ
- గుండాల చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే

**గుండాల, జూలై 17 (క్రైమ్ మిర్రర్):** గుండాల మండల నూతన చేనేత సహకార సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన చిందం ప్రకాష్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, చేనేత కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి, చేనేత సహకార సంఘాల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అహర్నిశలు కృషి చేస్తోందని పేర్కొన్నారు.చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యం రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడిన ఆయన, గుండాల మండల చేనేత కార్మికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.25 లక్షల వ్యయంతో చేనేత కార్మికుల కోసం ప్రత్యేక షెడ్డు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ అండెం సంజీవరెడ్డి, ఏ.డి శ్రీనివాసరావు, ఎమ్మార్వో హరికృష్ణ, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, సంఘం మాజీ చైర్మన్ దుడుక ఉప్పలయ్య, పాలకవర్గ సభ్యులు, చేనేత కార్మికులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు

**చౌటుప్పల్, జూలై 17, క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ మండలం, దండు మల్కాపురం గ్రామ పరిధిలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం హుండీ లెక్కింపును శుక్రవారం దేవస్థానం ప్రాంగణంలో దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి కే భాస్కర్, సహాయ కమిషనర్ దేవదాయ శాఖ నల్గొండ ఆధ్వర్యంలో భక్తుల సమర్పించిన కానుకల హుండీ లెక్కించారు. 15 లక్షల13 వేల 204 రూపాయలు వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి, ధర్మకర్తలు జొన్న గంటి దాసు, డి రాజేష్, డి రాజేష్, ఈ బాబు, ఎస్ ఆనంద్ రెడ్డి,వి శివ చారి, బి నరసింహ, ఎం మహేందర్ రెడ్డి, బి యువరాజు, పి రమేష్, బి శ్రీకాంత్, సిహెచ్ సబిత , మీసాల నరసింహ, గ్రామ ఉపసర్పంచ్, వెలువర్తి యాదగిరి,ఈడుదల మస్తాన్ బాబు, సిహెచ్ జంగయ్య, జంగారెడ్డి,శ్రీవారి సేవా సమితి సభ్యులు,సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్వాడీ నియామకాల్లో రాజకీయ జోక్యం వద్దు!

**టీచర్ ఆయా నియామకాలు పూర్తి పారదర్శకంగా జరగాలి.**

**నిజమైన అర్హులకే ఉద్యోగాలు కల్పించాలి.. అధికారులకు సర్పంచ్ వల్లంల విజ్ఞప్తి**

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మర్రిగూడ మండలంలో అంగన్వాడీ టీచర్ 5 , ఆయా 4 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో, టీచర్ పోస్ట్ కోసం 67 మంది, ఆయా పోస్ట్ ల కోసం 24 మంది చొప్పున, మొత్తం 91 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫై ప్రక్రియను అధికారులు చేస్తున్నారు. వెరిఫికేషన్, నియామక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, యరుగండ్లపల్లి గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ అధికారులను కోరారు. రాజకీయ నాయకుల సిఫార్సులు, వ్యక్తిగత ఒత్తిళ్లు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా, అర్హత, మెరిట్ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకొని ఉద్యోగాల కోసం, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న వారికి, అంగన్వాడీ ఉద్యోగాలు ఒక మంచి అవకాశమని అన్నారు. అలాంటి అవకాశాలను రాజకీయ పలుకుబడి ఉన్న వారికో, సిఫార్సులతో వచ్చే వారికో కట్టబెట్టడం వల్ల నిజమైన అర్హులకు, తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణలో అత్యంత కీలక పాత్ర



పోషిస్తున్నాయని, అందువల్ల బాధ్యతాయుతమైన ఈ ఉద్యోగాలకు అర్హత కలిగిన, సేవాభావం ఉన్న అభ్యర్థులనే ఎంపిక చేయాలని అన్నారు. అర్హతలను పక్కనపెట్టి నియామకాలు చేపడితే ప్రభుత్వ లక్ష్యాలు దెబ్బతినడంతో పాటు, చిన్నారుల భవిష్యత్తుపైన ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నియామక ప్రక్రియలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి దరఖాస్తును సమాన దృష్టితో పరిశీలించి మెరిట్ జాబితా ఆధారంగా, ఎంపికలు చేపట్టాలని అధికారులను వల్లంల కోరారు. ఎంపికల ప్రక్రియపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై, విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. చదువుకొని ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిజమైన, అర్హుల ఆశలను వమ్ము చేయకుండా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అధికార యంత్రాంగం ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, సిఫార్సులు, ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, యరుగండ్లపల్లి సర్పంచ్ వల్లంల సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు.

# కల్లు గీత కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ.

**సర్పంచ్ సంతోష్ యాదవ్ చేతుల మీదుగా అందజేత**

**ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించిన నాంపల్లి ఎక్సైజ్ అధికారులు**

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** కల్లు గీత కార్మికుల భద్రతే ప్రధాన లక్ష్యంగా, నాంపల్లి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మర్రిగూడ మండలంలోని యరుగండ్లపల్లి, గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కల్లు గీత వృత్తిదారులకు సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ చేతుల మీదుగా, కార్మికులకు ఈ సేఫ్టీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ మాట్లాడుతూ..గీత కార్మికులు తమ ప్రాణాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి క్షణం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ, ఎక్సైజ్ శాఖ అందిస్తున్న సేఫ్టీ కిట్లను ప్రతి కార్మికుడు తప్పనిసరిగా ఉపయోగించాలని, నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలను నివారించడంలో ఈ కిట్లు, ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాల సంక్షేమాన్ని, దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. గీత కార్మికులకు భద్రతా ప్రమాణాలపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెట్లపైకి ఎక్కి కల్లు గీయడం ప్రమాదకరమైన వృత్తి కావడంతో, ప్రతి కార్మికుడు తప్పనిసరిగా సేఫ్టీ కిట్లను వినియోగించాలని అధికారులు సూచించారు. కార్మికుల ప్రాణ రక్షణ కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. భద్రతా పరికరాల వినియోగంతో



పాటు పని సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తూ గీత కార్మికుల్లో భద్రతా చైతన్యాన్ని మరింత పెంపొందిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందించే రక్షణ పరికరాలను సక్రమంగా ఉపయోగించడం ద్వారా, ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. కిట్లను ఎలా ధరించాలి, ఏ సందర్భాల్లో ఎలా వినియోగించాలి, చెట్లపైకి ఎక్కే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశాలను వివరించారు. గ్రామంలో మొత్తం 34 కిట్లను పంపిణీ చెయ్యగా, లైసెన్స్ ఉన్న వారు అప్లై చేసుకోవాలని వారికి కూడా వెంటనే కిట్లను ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఎక్సైజ్ ఎస్ఐ, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం సభ్యులు, కల్లు గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలకు రక్షణ కవచాలుగా సీసీ కెమెరాలు

**చౌటుప్పల్ సీఐ జీ మన్మథ కుమార్**

**చౌటుప్పల్,జులై 17,క్రైమ్ మిర్రర్ :** గ్రామాలలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు గ్రామాలకు,ప్రజలకు రక్షణ కవచాలుగా పనిచేస్తాయని చౌటుప్పల్ సిఐ జీ మన్మథ కుమార్ తెలిపారు. శుక్రవారం యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల మేరకు, సీఐ జి.మన్మథ కుమార్, ఎస్ఐ యాదగిరి లు ఎస్. లింగోటం గ్రామాన్ని సందర్శించి, గ్రామంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు,అన్ని వ్యాపార సంస్థల వద్ద సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత వాటి ఏర్పాటు



గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలో సిసి కెమెరాలు ఉండటం నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు అత్యంత ముఖ్యమని ఇది గ్రామంలో జరిగే ప్రతి సంఘటనలను నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్ లు మాట్లాడుతూ.. గ్రామంలో అవసరమైన ప్రదేశాలలో సీసీటీవీ కెమెరాలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, కిరాణా దుకాణాలు, హోటళ్లు మరియు ఇతర వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి యువకుడు మృతి

**మృతుడి నుండి ఉద్యోగం పేరుతో డబ్బులు వసూలు..**

**తిరిగి డబ్బులు అడగడంతో బెదిరింపులు ఎదుర్కొన్నాడా..?**



**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలానికి చెందిన, చాపల శివ (25) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన, స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ఘటన వెనుక ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.! స్థానికంగా వినిపిస్తున్న వివరాల ప్రకారం, కొంగర్ కలాన్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి, ఓ మహిళ సదరు యువకుడి వద్ద నుంచి 55 వేల వరకు తీసుకున్నట్లు తెలుస్తోంది.! అయితే చాలా రోజులైనా ఉద్యోగం ఇప్పించకపోవడంతో, తాను ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని యువకుడు కోరినట్లు సమాచారం.! ఈ క్రమంలో డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయగా, సదరు మహిళ అతనిపై కేసులు పెడతానంటూ, బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.! ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు.! మృతుడి కుటుంబ సభ్యులు ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే తరహాలో ఉద్యోగాల పేరుతో మరికొందరి వద్ద కూడా, సదరు మహిళా డబ్బులు వసూలు చేసినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, ప్రస్తుతం వాటిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తుంది. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఉద్యోగం పేరుతో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణల్లో, వాస్తవం ఎంత వరకు ఉందనే అంశాలపై విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఏది ఏమైనా పూర్తి స్థాయి దర్యాప్తుతోనే మృతుడి మరణానికి, చట్టపరమైన న్యాయం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారు..

# తెలంగాణ బీసీ గురుకులాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వెంటనే పరిష్కరించాలి

**బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ డిమాండ్**

**హైదరాబాద్, జూలై 17(క్రైమ్ మిర్రర్):** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా ప్రతినిధి బృందం బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీని కలిసి రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురుకుల విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, నేడు అదే బీసీ విద్యార్థులను కనీస మౌలిక సదుపాయాలు లేకుండా దుర్భర పరిస్థితుల్లో చదివేలా చేయడం అత్యంత బాధాకరమన్నారు. గురుకులాల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థుల మరణాలు, అస్వస్థత ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ప్రభుత్వం వెంటనే చేపట్టాల్సిన చర్యలు:**

- శిథిలావస్థకు చేరిన గురుకుల భవనాలు, హాస్టళ్లు, మరుగుదొడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలి.
- విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందించాలి.
- ప్రతి గురుకులంలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి.
- ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్, పారిశుధ్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
- ఆహార సరఫరా, నిధుల దుర్వినియోగంలో అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.



- ప్రతి గురుకులంలో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి.
- ఇంటర్మీడియట్ విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు అందించి, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పించాలి.
- గతంలో గురుకులాల్లో జరిగిన విషాద ఘటనల్లో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం, ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థులకు అత్యవసర ఆర్థిక సహాయం అందించాలి.
- బీసీ విద్యార్థుల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చిత్తశుద్ధితో స్పందించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని జక్కలి రాజు యాదవ్ డిమాండ్ చేశారు.
- లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలను సమీకరించి బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో భారీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు.

# కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో పందుల బెడదకు చెక్...

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై, ఇళ్ల ముందు సంచరిస్తున్న పందుల బెడదను అరికట్టేందుకు శుక్రవారం కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గత కొంత కాలంగా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పందులు యథేచ్ఛగా తిరుగుతూ మురికిని పెంచుతూ, రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ లకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని పందులను పట్టుకుని మున్సిపాలిటీ వెలుపలికి తరలించే ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు.





# దోమల నియంత్రణకు 'ఫ్రైడే--డ్రైడే'

**మంచిర్యాలలో ఇంటింటికీ అవగాహన.. నీటి నిల్వల తొలగింపుపై ప్రత్యేక దృష్టి**

**ప్రజల భాగస్వామ్యంతోనే కీటక జనిత వ్యాధుల నియంత్రణ సాధ్యం : మేయర్ ధరణి మధుకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్**

**మంచిర్యాల, జూలై 17 (క్రైమ్ మిర్రర్):** వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే కీటక జనిత వ్యాధులను అరికట్టేందుకు మంచిర్యాల పురపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. నస్పూర్, సీసీసీ, సీతారాంపల్లి వార్డుల్లో మేయర్ ధరణి మధుకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, స్థానిక కార్పొరేటర్లు సౌమ్య కుమారస్వామి, కర్రె శ్రీనివాస్, సంపత్ రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు పరిశుభ్రత, కీటక జనిత వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇళ్ల పరిసరాలను పరిశీలించిన అధికారులు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. వాడిపడేసిన టైర్లు, కొబ్బరి బొండాలు, ఖాళీ పాత్రలు, కూలర్లు, ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ ధరణి మధుకర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రైడే' పాటిస్తూ ఇళ్లలో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. దోమలు గుడ్లు పెట్టే దశలోనే లార్వాలను నిర్మూలిస్తే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధులను నివారించవచ్చన్నారు. దోమతెరలు వినియోగించడం, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించడం ద్వారా టైఫాయిడ్, అతిసారం, వాంతులు, విరేచనాలు, కామెర్లు వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్తను వేయకుండా మున్సిపల్ సిబ్బందికే అందించాలని, ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ, పురపాలక శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని కీటక జనిత వ్యాధుల నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు. నీటి నిల్వ ప్రాంతాల్లో టెమిఫాస్ మందు వినియోగించి దోమల లార్వాలను నిర్మూలిస్తున్నట్లు తెలిపారు. అలాగే మంచిర్యాల పురపాలక పరిధిలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు మేయర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు పరిశుభ్రత, నీటి నిల్వల తొలగింపు, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో టెమిఫాస్ వినియోగించి లార్వా నిర్మూలన చర్యలు చేపట్టారు.




## హెల్మెట్ వాడకంతో ప్రాణరక్షణ...

**చౌటుప్పల్,జులై 17,క్రైమ్ మిర్రర్ :** రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ద్విచక్ర వాహనదారులు ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే హెల్మెట్ ధరించడం ఒకటే మార్గమని చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని ట్రినిటీ హైస్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేశం హాజరై మాట్లాడుతూ... విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన గురించి ట్రాఫిక్ రూల్స్ వివరించారు. విద్యార్థులు వివిధ ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి ఇంట్లో పెద్దవారికి ఈ విషయాలు చెప్పాలని అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపవద్దని సూచించారు. అలాగే వాహనాలను నడిపేటప్పుడు మొబైల్స్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ సిగ్నల్ ఉన్నప్పుడు రోడ్డు దాటాలని,త్రిపుల్ రైడింగ్ చేయవద్దన్నారు. బండి నడుపునప్పుడు ఇండికేటర్స్ తప్పకుండా వాడవలనని, అలాగే నో పార్కింగ్ వద్ద వెహికల్ ని పార్కింగ్ చేయవద్దని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ వివరించారు. అలాగే విద్యార్థుల చేత తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, ట్రాఫిక్ ఎస్ఐ జి సైదిరెడ్డి,ఆర్ ఎస్ ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ జంగయ్య, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి



**చౌటుప్పల్,జులై 17, క్రైమ్ మిర్రర్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం చౌటుప్పల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి, అక్కడ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా శంకుస్థాపన చేసిన ఈ ఆసుపత్రి నిర్మాణం సంవత్సరాలు గడుస్తున్నా నత్తనడకన సాగుతుండటంతో ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. చౌటుప్పల్ ఆరు మండలాలకు కేంద్రంగా ఉండటంతో పాటు జాతీయ రహదారిపై ఉన్న ప్రాంతం కావడంతో ప్రతి రోజు అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసర వైద్య సేవలు అందించడానికి 100 పడకల ఆసుపత్రి ఎంతో అవసరమని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రమాద బాధితులు, పేద ప్రజలు మెరుగైన వైద్య సేవలు పొందేందుకు హైదరాబాదుకు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి లక్షల రూపాయలు పెట్టిన ప్రాణాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్, సిపిఎం పార్టీ నాయకులు బత్తుల దాసు, బొడ్డు అంజిరెడ్డి, ఎండి ఖయ్యూం, దండ అరుణ్ కుమార్,గోపగోని లక్ష్మణ్ గౌడ్, ఆకుల ధర్మయ్య, ఉష్కాగుల రమేష్, ఉష్కాగుల శ్రీనివాస్, తూర్పునూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి,బత్తుల రమేష్, ఎండి ఖాసిం, వెల్తురు జంగయ్య పాల్గొన్నారు.

# వానమ్మా...ఒక్కసారి అన్నరావా..!!

- ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో విలవిలలాడుతున్న రైతాంగం
- మేడిగడ్డ బ్యారేజ్ ఉన్నా అందని సాగునీరు
- ఆకాశం వైపే ఆశగా చూస్తున్న అన్నదాత
- ఎండిపోతున్న పత్తి పంటలు...పెరుగుతున్న ఆందోళన





**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ప్రారంభమైనప్పటికీ, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. వర్షాల కోసం రైతులు ప్రతిరోజూ ఆకాశం వైపు ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పొలాలను దున్ని, విత్తనాలు వేసి, ఎరువులు చల్లి పంటలను సాగు చేసిన రైతులు ఇప్పుడు ప్రకృతి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

**జిల్లా వ్యాప్తంగా రైతుల ఎదిరిచూపులు..**

జిల్లాలోని మహదేవ్‌పూర్, పలిమెల, కాటారం, మల్హర్‌రావు, మహాముత్తారం, రేగొండ, మొగుళ్లపల్లి, టేకుమట్ల, భూపాలపల్లి తదితర మండలాల్లో రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమంది రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సాగు ప్రారంభించగా, ఇప్పుడు వర్షాలు లేక పెట్టుబడి కూడా తిరిగి వస్తుందా అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి వర్షాలు కురవకపోతే మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి వస్తుందని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. వర్షాభావం కారణంగా వ్యవసాయ పనులు కూడా నిలిచిపోయి గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది.

**ఎండిపోతున్న పత్తి పంట..**

జిల్లాలో ప్రధానంగా సాగు చేస్తున్న పత్తి పంటకు ప్రారంభ దశలో తగినంత తేమ అవసరం. అయితే గత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడం, మండుతున్న ఎండల కారణంగా మొలకెత్తిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఎకరాకు వేల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. వర్షాలు మరో వారం రోజులు కూడా పడకపోతే పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఖరీఫ్ సీజన్‌లో కన్నీళ్లు పెడుతున్న రైతాంగం..**

ప్రతి ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశలను నింపాల్సిన సమయం. కానీ ఈసారి వర్షాభావం కారణంగా రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఒకవైపు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడం, మరోవైపు సాగు ఖర్చులు భారీగా పెరగడంతో అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులు ఇప్పుడు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. పంటలు దెబ్బతింటే కుటుంబ పోషణ ఎలా, అప్పులు ఎలా తీర్చాలి అనే ఆందోళన వారిని వెంటాడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు తక్షణ సహాయం అందించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

**జిల్లాలో మేడిగడ్డ బ్యారేజ్ ఉన్నా రైతులకు నీటి కష్టాలు..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనే గోదావరి నదిపై నిర్మించిన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజ్ ఉన్నప్పటికీ, ఆ నీటి ప్రయోజనం జిల్లాలోని రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రాజెక్టులు ఉన్నా, సాగునీరు కాలువల ద్వారా పొలాలకు చేరకపోవడంతో రైతులు వర్షాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు భారీ ప్రాజెక్టులు, మరోవైపు నీటిలేక ఎండిపోతున్న పంటలు అనే విరుద్ధ పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది. సాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, రైతుల పొలాలకు నీరు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వర్షాభావం ముప్పు 'మారాల్సిందే సాగు విధానం' : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష
- మారుతున్న వాతావరణానికి అనుగుణంగా సాగు విధానాలు మార్చుకోవాలి
- కూరగాయల సాగుకు ఎకరాకు రూ.9,600 ప్రోత్సాహకమని వెల్లడి

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు సాగు విధానంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. అధిక నీటి అవసరం ఉండే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి, మిల్లెట్స్, పప్పు దినుసులు, కూరగాయలు, పామాయిల్ వంటి పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ఆదా చేస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు బిందు, తుంపర్ల సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని చెప్పారు. తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయడం ద్వారా రైతులు వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలరని పేర్కొన్నారు. భూగర్భ జలాలపై ఆధారపడి బోరు బావులతో వరి సాగు చేయడం ప్రమాదకరమని, రానున్న రోజుల్లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం ఎకరాకు రూ.9,600 ప్రోత్సాహకం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ, జిల్లాకు ప్రత్యేక కంటింజెన్సీ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా ఉద్యానవన అధికారి తిరుపతి, వ్యవసాయ శాఖ అధికారులు, అన్ని మండలాల ఏఈవోలు పాల్గొన్నారు.



# గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వెల్దండ మండలం గుండాల గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను పరిశీలించారు. మొదట భోజనశాల, డైనింగ్ హాల్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. వంటశాలలో ఆహార పదార్థాల నిల్వ, తాగునీటి వినియోగం, వంట ప్రక్రియలను తనిఖీ చేసి నాణ్యమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల డార్మిటరీలను పరిశీలించిన ఆయన పడకల ఏర్పాటు, గదుల పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి వసతి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించిన కలెక్టర్, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, డిజిటల్ లెర్నింగ్ వినియోగం, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఏ గ్రామాలు, ఏ మండలాల నుంచి వచ్చారో అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గిరిజన గ్రామాలకు చెందినవారని తెలిపారు. విద్యార్థులకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచనా వేసిన కలెక్టర్, సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా బోధన సమర్థవంతంగా కొనసాగాలని సూచించారు. భావనాత్మక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పోటీ పరీక్షలకు అవసరమైన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ఆత్మవిశ్వాసం పెంపొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన పాఠశాల సమీపంలోని గుట్ట ప్రాంతాన్ని తొలగించి ప్రాంగణంలోనే బోరు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన బోరు తవ్వకాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, క్రీడా సామగ్రి, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ వినియోగం వంటి అంశాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,...... గిరిజన విద్యార్థులకు అత్యున్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏకలవ్య గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు పెంపొందించుకునేలా గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్నచిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఆహారం వంటి ప్రాథమిక అవసరాల విషయంలో ఎలాంటి లోపాలు ఉండరాదని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి,వెల్దండ తహశీల్దార్ కార్తిక్ కుమార్, యంఈఓ చంద్రుడు నాయక్, పాఠశాల ప్రిన్సిపల్,వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు

# సమిష్టి కృషితో ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందాం

### కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ జూలూరు రమేష్ బాబు

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని సమిష్టి కృషితో అందరం కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని ఆలయ ట్రస్ట్ చైర్మన్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలయం లో రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలను చర్చించారు. దాదాపు 38 సంవత్సరాల క్రితం పట్టణంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఆలయంతోపాటు ఆలయం ఆవరణలో ఉన్న ఫంక్షన్ హాల్ మరమ్మత్తు చేసుకుందామని పిలుపునిచ్చారు. దాదాపు 80 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను చేపడతామన్నారు. అందులో భాగంగా 2026 -27 దసరా నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా కల్మిచర్ల గోపాల్ ను ఎన్నుకున్నారు. సంవత్సర కాలం పాటు ఆలయంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ మాట్లాడుతూ వైశ్యులంతా ఐక్యమత్యంతో మెలిగి ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిది ముందుకు సాగుదాం అన్నారు. ఈ సందర్భంగా జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొండూరు గోవర్ధన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ కల్వకుర్తి డిపో అధ్యక్షునిగా ఎన్నికైన శివ జగదీశ్వర్, కల్మిచర్ల గోపాల్ లను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి 108ఎ గవర్నర్ కల్మిచర్ల రమేష్,మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంధం ప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాస శేఖర్, కల్వ మనోహర్, శివాలయం శ్రీనివాస్, గంప శ్రీనివాస్, బచ్చు ఎల్లయ్య, శ్రీధర్, ముత్యాలు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు పాల్గొన్నారు.





# దోమల నివారణకు ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజు డ్రై డే తప్పనిసరిగా పాటించాలి

### విద్యార్థులు అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న సావిత్రిబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంతో పాటు కాలనీలోని పలువురి ఇండ్ల ముందర నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మున్సిపల్ చైర్‌పర్సన్ భృంగి రత్నమాలతో కలిసి పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు ప్రతి శుక్రవారం చేపట్టే చేపట్టిన కార్యక్రమంలో వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.... వర్షాకాలంలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ప్రజలందరూ బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఇళ్లలో, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, వ్యాపార సంస్థల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. కూలర్లు, నీటి ట్యాంకులు, డ్రమ్ములు, బకెట్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఉపయోగం లేని పాత్రలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా వారానికి కనీసం ఒకసారి పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు. దోమలు నిల్వ నీటిలోనే ఎక్కువగా వృద్ధి చెందుతాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ప్రజల సహకారంతోనే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబం "ప్రతి శుక్రవారం డ్రై డే" అనే భావనను అలవాటు చేసుకుని, తమ ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌తో కలిసి కాలనీలోని పలువురి ఇండ్లను సందర్శించి నిల్వ నీటి ప్రాంతాలను పరిశీలించారు. ఇంటి యజమానులకు దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ, పరిశుభ్రత పాటించాలని సూచించారు. అధికారులు కూడా ప్రజలకు డ్రై డే నిర్వహణ ప్రాముఖ్యతను వివరించి, ప్రతి వారం తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ అహ్మద్, కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నిర్ధారణ చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికత విప్లవం

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జూలై 17 :** క్యాన్సర్ నిర్ధారణ చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిందని క్యాన్సర్‌ను నయం చేయడమే కాదు రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం శస్త్రచికిత్సల లక్ష్యమని హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాల ఆంకాలజీ రోబోటిక్ సైన్సెస్ డాక్టర్ చిన బాబు పేర్కొన్నారు ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తిగా నయం చేస్తుందన్నారు. అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో రోబోటిక్ శస్త్రచికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ ఒకటి అని, ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం, తక్కువ టిష్యూ డ్యామేజ్ తక్కువ రక్తనష్టం, వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయని అన్నారు. సాధారణంగా చెప్పాలంటే పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పనిచేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారని, దీని వలన రోగికి తక్కువ నొప్పి, చిన్న మచ్చలు తక్కువ రక్తనష్టం కలుగుతుందని, ఇంకా స్మార్ట్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా సురక్షితంగా మారుతున్నాయని అన్నారు. మహిళల క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ ముఖ్యంగా గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్స గొప్ప ఫలితాలను ఇస్తోందని, రడికల్ హైస్టెరెక్టమీ లింఫ్ నోడ్ డిస్సెక్షన్ వంటి క్లిష్టమైన ఆపరేషన్లు సురక్షితంగా చేయవచ్చునని తెలిపారు. గతంలో 4-5 రోజుల ఆసుపత్రి ఉండాల్సి వచ్చేదని, ఇప్పుడు చాలామంది రోగులను 24 గంటల్లోనే డిశ్చార్జ్ చేయవచ్చునని తెలిపారు.



### రొమ్ము క్యాన్సర్లో ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ

రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కూడా ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీ కొత్త దిశను చూపుతోందని, ప్రత్యేకమైన డై ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, క్యాన్సర్ నుండి మొదట ప్రభావితమయ్యే సెంటినెల్ లింఫ్ నోడ్స్ ప్రత్యేక కెమెరా ద్వారా స్పష్టంగా కనిపిస్తాయని, దీని వలన అవసరమైన లింఫ్ నోడ్స్‌ను మాత్రమే ఖచ్చితంగా తొలగించవచ్చునని గతంలో లాగే అన్ని లింఫ్ నోడ్స్ తొలగించాల్సిన అవసరం తగ్గి చేతి వాపు(లైఎంఫీహెడేమా) నొప్పి ఇతర సమస్యలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ఇది రోగి జీవన నాణ్యతను మరింత మెరుగుపరుస్తుందన్నారు.

### యూరాలజీ క్యాన్సర్లలో సరికొత్త మార్పులు

ప్రోస్టేట్ బ్లాడర్ కిడ్నీ అడ్రినల్ ట్యూమర్ల చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చిందని, ప్రోస్టేట్, బ్లాడర్ క్యాన్సర్లలో పెళవిక్ ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం వల్ల ఓపెన్ సర్జరీ క్లిష్టంగా ఉండేదని, ఇప్పుడు రోబోటిక్ సర్జరీ ద్వారా మెరుగైన నేర్వ్ ప్రెజర్వేషన్ సాధ్యమై, ఉరినరీ కంటినయన్స్ సెక్సువల్ ఫంక్షన్ మెరుగ్గా కాపాడవచ్చునని తెలిపారు. కిడ్నీ క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ వలన పార్టియల్ నీఫరెక్టమీ ఎక్కువగా చేయగలుగుతున్నామని, అంటే కేవలం ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి , మిగిలిన ఆరోగ్యకరమైన కిడ్నీని కాపాడటం సాధ్యమవుతోందని, దీని వలన పూర్తి కిడ్నీ తొలగించాల్సిన అవసరం తగ్గి, క్యాన్సర్ నియంత్రణలో ఎలాంటి రాజీ లేకుండా మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. అడ్రినల్ ట్యూమర్లలో కూడా తక్కువ రక్తనష్టం, చిన్న గాయాలు, వేగవంతమైన కోలుకోవడం వంటి ప్రయోజనాలతో సురక్షితంగా శస్త్రచికిత్సలు చేయవచ్చునని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నిర్లక్ష్యానికి తావులేదు.. విద్యా ప్రమాణాల విషయంలో రాజీ ఉండదు

- కల్వకుర్తి గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- గైర్హాజరైన ముగ్గురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డీఈఓ కు ఆదేశం

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, విద్యా ప్రమాణాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల బాధ్యత అత్యంత కీలకమని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న వెంటనే విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ, బోధన విధానం, విద్యార్థుల అభ్యాస స్థాయి, పాఠశాల నిర్వహణ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు చదువుతున్న పాఠాలు, పుస్తకాల వినియోగం, ఉపాధ్యాయుల బోధన, ప్రతిరోజూ తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ప్రధానోపాధ్యాయుడు శంకర్‌తో పాటు ఉపాధ్యాయులు లావణ్య, మానస విధులకు గైర్హాజరైనట్లు కలెక్టర్ గుర్తించారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ముగ్గురు ఉపాధ్యాయులు ఒకేసారి విధులకు రాకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో ఉపాధ్యాయులు విధులకు దూరంగా ఉండడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆగ్రహం కలెక్టర్ వ్యక్తం చేశారు. పాఠశాలలో విధులకు హాజరైన ఉపాధ్యాయులు సరస్వతి, రజితలను కలెక్టర్ వివిధ అంశాలపై ప్రశ్నించారు. విద్యార్థుల హాజరు శాతం, ప్రతిరోజూ నిర్వహిస్తున్న తరగతులు, సబ్జెక్టుల బోధన, విద్యార్థుల అభ్యాస స్థాయి, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మొత్తం 94 మంది విద్యార్థులు ఈ రోజు పాఠశాలకు హాజరైనట్లు తెలుసుకున్న కలెక్టర్, కేవలం ఇద్దరు ఉపాధ్యాయులతో అన్ని తరగతులను ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒకేసారి అనేక తరగతులకు బోధన చేయాల్సి వస్తే విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, చిన్నారులకు నాణ్యమైన విద్య అందకుండా పోతుందని, ప్రతి తరగతికి సమర్థవంతమైన బోధన అందేలా ఉపాధ్యాయులు విధుల్లో తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. పాఠశాల నుండి జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ప్రధానోపాధ్యాయుడు శంకర్‌తో



పాటు ఉపాధ్యాయులు లావణ్య, మానసపై వెంటనే సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తూ తగిన నివేదికలను తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలను విస్మరించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందని, అలాంటి సమయంలో ఉపాధ్యాయులు తమ బాధ్యతలను మరింత నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, వారి నిర్లక్ష్యం వందలాది మంది విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రభావం చూపుతుందని,పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ప్రతి విద్యార్థికి నాణ్యమైన బోధన అందించడం ప్రతి ఉపాధ్యాయుడి ప్రాథమిక బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తూ పాఠశాలల్లో మౌలిక వసతులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తోందని, ఈ లక్ష్యాలు సఫలీకృతం కావాలంటే ఉపాధ్యాయులు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసంలో అలసత్వం ప్రదర్శించే ఉపాధ్యాయులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, విధుల్లో నిర్లక్ష్యం, క్రమశిక్షణా లోపాలు, అనధికారిక గైర్హాజరు వంటి అంశాలు ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల అభ్యాస ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తరగతులను సమయానికి ప్రారంభించి నాణ్యమైన బోధన అందించాలని, ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యాలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి తహహసిల్దార్ ఇబ్రహీం వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

**అల్లందేవిచెరువు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు-బాత్క శేఖర్ యాదవ్**

**సంస్థాన్ నారాయణపురం, జూలై 17(క్రైమ్ మిర్రర్):** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు నారాయణపురం మండలం , అల్లందేవిచెరువు గ్రామానికి చెందిన లబ్ధిదారులు వట్టికోటి శేఖర్, బద్దం నర్సిరెడ్డిలకు, కాంగ్రెస్ పార్టీ గ్రామ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో



చికిత్స పొందిన పేద ప్రజలు తమ వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**గర్భిణీలను ఏఎన్‌సీ పరీక్షలకు తీసుకురావడంలో తప్పనిసరిగా 102 సేవలను వినియోగించాలి**

**ఆశా కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశం**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శుక్రవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, గర్భిణీలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించిన కలెక్టర్ వైద్యులు, సిబ్బందితో మాట్లాడి రోగులకు అందుతున్న చికిత్స, పరీక్షలు, మందుల లభ్యత, మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి తనిఖీ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ఏఎన్‌సీ (అంటెనాటల్ కేర్) పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ మహిళలను జిల్లా కలెక్టర్ పలకరించారు. వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా మాట్లాడిన ఆయన, ఏ గ్రామం నుంచి వచ్చారు, ఆసుపత్రికి ఎలా వచ్చారు, ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన గర్భిణీలు తాము బస్సులో ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. దీంతో అక్కడే ఉన్న ఆశా కార్యకర్తలను జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. ప్రభుత్వం గర్భిణీల కోసం ఉచితంగా అందుబాటులో ఉంచిన 102 అంబులెన్స్ సేవలు ఉన్నప్పటికీ వాటిని ఎందుకు వినియోగించలేదని ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఏఎన్‌సీ పరీక్షలు, ప్రసూతి సేవలు, ఇతర వైద్య అవసరాల కోసం గర్భిణీ మహిళలను ఆసుపత్రులకు తీసుకువచ్చే ప్రతి సందర్భంలో తప్పనిసరిగా 102 అంబులెన్స్ సేవలను వినియోగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గర్భిణీలకు సురక్షితమైన, సమయానుకూలమైన ఉచిత రవాణా కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 102 సేవలను అందుబాటులో ఉంచిందని, వాటిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా గర్భిణీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వైద్య సేవలు పొందగలరని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ఆశా కార్యకర్తలు మరింత బాధ్యతతో వ్యవహరించి ప్రతి గర్భిణికి ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహిస్తున్న విభాగాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఎంతమంది గర్భిణీలకు ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహిస్తున్నారు, నమోదు వివరాలు సక్రమంగా నిర్వహిస్తున్నారా, అవసరమైన పరీక్షలు అన్నీ జరుగుతున్నాయా అనే అంశాలపై రికార్డులను పరిశీలించారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, హైరిస్క్ గర్భిణీలను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. తదుపరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్యుల అందుబాటు, సిబ్బంది స్పందన, ఆసుపత్రిలో పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగే విధంగా సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ మహమ్మద్, కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం, డాక్టర్ శివరాం, కల్వకుర్తి డిప్యూటీ డీఎంహెచ్ఓతో పాటు వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



## శ్రీ కృష్ణ గోపాల సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమం

**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,జూలై 17:** శ్రీ కృష్ణ గోపాల సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ పట్టణానికి చెందిన శ్రీ హరి బాబు సహకారంతో పేద విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 275 మంది చిన్నారులకు అల్పాహారం అందించి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా పేద విద్యార్థులకు నిత్యం ఆహార సహాయం అందించడం తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, అవసరమైన వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీ కృష్ణ గోశాల సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని నిర్వాహకులు కోరారు. సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలనుకునే వారు 8106876999 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ?

# వేసవి వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండొద్దు

**ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమమని, మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని మిషన్ భగీరథ 60 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ప్లాంట్‌లోని ప్రతి విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముడి నీటిని స్వీకరించే దశ నుంచి శుద్ధి పూర్తై గ్రామాలకు పంపిణీ చేసే వరకు జరిగే ప్రతి ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కోగ్యులేషన్, ఫ్లోక్యులేషన్, సెడిమెంటేషన్, ఫిల్టరేషన్, క్లోరినేషన్ వంటి శుద్ధి ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఫిల్టర్ హౌస్‌లో ఉపయోగిస్తున్న యంత్రాల పనితీరు, పంపుల సామర్థ్యం, విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు తీసుకునే ప్రత్యామ్నాయ చర్యలు, శుద్ధి కోసం వినియోగిస్తున్న రసాయనాల మోతాదు, నీటి నాణ్యత పరీక్షల విధానం తదితర అంశాలపై సవివరంగా ఆరా తీశారు. ప్రతిరోజూ ప్లాంట్‌కు ఎంత మేర ముడి నీరు వస్తుంది, ఎంత మేర శుద్ధి చేసి పంపిణీ చేస్తున్నారు, ఎన్ని గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది, సరఫరాలో ఎక్కడైనా సమస్యలు ఎదురవుతున్నాయా, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న నీరు ప్రభుత్వ త్రాగునీటి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామానికి ప్రతిరోజూ నాణ్యమైన త్రాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే త్రాగునీటిలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పంపింగ్ వ్యవస్థ, శుద్ధి కేంద్రం, నిల్వ రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. చిన్నచిన్న సాంకేతిక లోపాలు కూడా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున యంత్రాలను ఎప్పటికప్పుడు నిర్వహణలో ఉంచాలని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నాగర్ కర్నూలు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో గ్రామీణ ప్రజలు ప్రధానంగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీటిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. అందువల్ల రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటి నిర్వహణపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నీటి వృథాను పూర్తిగా నివారించాలని, పైప్‌లైన్లలో లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, మోటార్లు, పంపులు, ఫిల్టర్ యూనిట్లు ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు. అవసరమైన రసాయనాల నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, శుద్ధి ప్రక్రియలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్ సింగ్ ప్లాంట్ పనితీరుపై కలెక్టర్‌కు సమగ్ర వివరాలు అందించారు. కల్వకుర్తి త్రాగునీటి శుద్ధి కేంద్రం నుంచి కల్వకుర్తి, అచ్చంపేట, జడ్చర్లతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు చెందిన మొత్తం 460 గ్రామాలకు



ప్రతిరోజూ సుమారు 52 లక్షల లీటర్ల శుద్ధి చేసిన త్రాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.నీటి శుద్ధి కోసం వినియోగిస్తున్న రసాయనాలు, ప్రయోగశాలలో నిర్వహిస్తున్న నాణ్యత పరీక్షలు, ఫిల్టర్ హౌస్ నిర్వహణ, పంపింగ్ వ్యవస్థ, పంపిణీ నెట్‌వర్క్ తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు.అనంతరం కలెక్టర్ ప్రయోగశాలను సందర్శించి నీటి నాణ్యత పరీక్షల విధానాన్ని పరిశీలించారు. నీటిలో క్లోరిన్ శాతం, టర్బిడిటీ, పీహెచ్ విలువలు తదితర ప్రమాణాలను క్రమం తప్పకుండా పరీక్షించాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన త్రాగునీరు అందించేందుకు అన్ని జాగ్రత్తలు కృషి కృషి తీసుకోవాలని అధికారులకు సూచించారు. శుద్ధి కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను కూడా కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని, ఏ గ్రామంలోనైనా నీటి సరఫరా నిలిచిపోయినా లేదా నాణ్యతపై అనుమానాలు వ్యక్తమైనా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మిషన్ భగీరథ పథకం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అత్యంత కీలకమైన కార్యక్రమమని, అందుకు అనుగుణంగా అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, డీఈఈ మహిపాల్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.